

# నిదురించిన మానవత్వం

చిత్తపు హనుమంతరావ్

"ఎటెండెన్సు రిజిస్టరు" అయ్యగారిగదిలో వుందండి."

సుబ్బారావును చూసి సవినయంగా అన్నాడు ఆఫీసు ప్యూను అప్పల్స్వామి.

అప్పల్స్వామి తదితరులచే అయ్యగారు అనబడే వ్యక్తి ఆఫీసరు నాగరాజుగారు. ఆ ఆఫీసును ఏక చ్ఛత్రాధిపత్యంగా పాలిస్తున్న నాగరాజుగారికి, మొగల్ సామ్రాజ్యాన్ని పాలించిన ఔరంగజేబుకీ కొన్నిపోలికలున్నాయనిఆఫీసుస్టాఫ్అనుకుంటారు; ఔరంగజేబుకి జాలి, దయ, ఉండేవి కావంటారు కర్కశహృదయుడంటారు. అతడు వేసే శిక్షలు క్రూరాతిక్రూరమైన వంటారు. నేరస్థుల్ని పులుల బోనుల్లోకి తోయించేవాడనీ, చిత్రవధ చేసి చంపించేవాడనీ,చేతులూ, కాళ్ళూ నరికించేవాడనీ నేరస్థుల శవాలు నగరపు శివారుల్లో వ్రేలాడ దీయించే వాడనీ, చెప్పుకుంటారు. ఔరంగజేబు లాగే నాగరాజుగారు కూడా కర్కశహృదయులు. ఆయనకు ఎవరిపట్లా, ఏ క్షణంలోనూ జాలి, దయా అనేవి కలుగవు సానుభూతి చూపడం అసలే అలవాటు లేదు. ప్రజాస్వామ్యంలో ఔరంగజేబులా శిక్షించడం నాగరాజుగారికి కాని పని. అంచేత అయనవేసే శిక్షలు మరో విధంగా వుంటాయి. ఆయనకు ఎవరిపై ఏ నేరంమోపాలో, ఏశిక్ష విధించాలో బాగాతెలుసు. ఆఫీసుకు అయిదు నిముషాలు ఆలశ్యమైతే 'హాఫ్ డే' క్యాజువల్ లీవు. క్యాజువల్ లీవు లేకపోతే, తిట్లూ, శావ నార్థాలు! లంచ్ టైము అయిదు నిము షాలు ఎక్కువ తీసుకుంటే తిన్న దేదో అరక్కుండా. కడుపు నొప్పి వచ్చేలా పెడబొబ్బలు!, ఆఫీసు టైమింగ్సులో 'పంక్చువాలిటీ' అన్నా, ఆఫీసు డిసిప్లిన్' అన్నా నాగ రాజుగారికి చాలా ఇష్టం. ఆఫీసు పనిలో ఏకొద్ది పొరపాటు జరిగినా క్షమించగల నైజం కాదు ఆయనిది!

'లోపలికి వెళదామా? వద్దా?...' అని ఆలో చిస్తూ కొద్ది క్షణాలు నాగరాజుగారి గది గుమ్మం దగ్గర నిలబడి పోయాడు సుబ్బారావు. చివరకు ధైర్యం తెచ్చుకొని స్ప్రింగ్‌డోర్ తెరుచుకొని లోపలికి అడుగు పెట్టాడు. స్ప్రింగ్‌డోర్ చేసిన కిర్రుమన్న శబ్దం దినపత్రికను పఠిస్తున్న నాగ రాజుగారి ఏకాగ్రతను భంగపరిచింది. పేపరు ప్రక్కకు తొలగించి, కళ్ళజోడు సవరించుకొని, కళ్ళింతవి చేసుకుని సుబ్బారావును చూశారు నాగ రాజుగారు. ఆయనలా చూడ్డంతో సుబ్బారావు ధైర్యం సడలిపోయింది.

"సార్...ఎటెండెన్సు..."అంటూ నీళ్ళు నమి లాడు సుబ్బారావు.

చేతిమన్న రోలెక్సు వాచీపై పు దృష్టిని సారిం చారు నాగరాజుగారు ఆపైన గర్జించారు.

"ఊఁ ఎటెండెన్సు...టైమెంతయింది?..."

సుబ్బారావు ఉలకలేదు, పలకలేదు. ముఖం దించుకుని నిలబడ్డాడు తాను వేసిన ప్రశ్నకు తానే సమాధానంచెప్పారు నాగరాజుగారు.

"పదకొండూ అయిదు ..ఆఫీసేమో పదిగంట లకు."

సుబ్బారావు కాదనలేదు; నేలచూపులు చూస్తూ మెల్లగా అన్నాడు:

'ఆఖరివాడికి వంట్లో బావుండలేదు..."

"లరో వాడికా?"

మాటలు నొక్కిపలికేరు నాగరాజుగారు సుబ్బా రావు మనసు చివుక్కుమంది. నీలాంటి దరిద్రు డికి ఆరుగురు పిల్లలు' అని ఆయన అన్నట్లు ఫీలయ్యాడు. ఆయన ఎన్నన్నా తను పడాల్సిందే. కారణం-ఆయన ఆఫీసరు; తను గుమాస్తా!

పైన క్రాంప్టన్' ఫాను గిరగిరా తిరుగుతోంది.

ఆ గాలికి నాగరాజుగారి బట్టతలమీద ఒకనాటి వైభవాన్ని చాటే శిథిలాల్లా మిగిలిన వెంట్రుకలు కదులుతున్నాయి. నాగరాజుగారు కళ్ళజోడు తీసి, కర్చీఫుతో తుడుచుకుంటూ ...

"నీ కొక్కడికే పిల్లలున్నట్లు మాటాడుతావేం ...ఇంకెవరికీ లేరా," అన్నారు.

"డబ్బున్నవాళ్ళ సంగతి వేరు సార్... ఫోను చేస్తే చాలు డాక్టరు పరుగెత్తుకుని వస్తాడు! మది మాబోటి బీదవాళ్ళ ఇళ్ళకు పదిసార్లు చెప్పులరిగేలా తిరిగితేనే కాని రాడు ... అటుపైన డబ్బు కోసం తిరగాలి.

"సోదంతా నా కెందుకు? ఏమంటే వెళిపో పెట్టచ్చుగా,"

"క్యాజువల్ లీవు అయిపోయింది."

"అయిపోదూ మరి, జనవరి నెల కాకుండానే క్యాజువల్ లీవు వాడేస్తారు. ఆ తర్వాత ఇది తంతు".

సుబ్బారావుకు ఓరిమి నశించింది.

"పెళ్ళాంకీ. పిల్లలకూ జబ్బులు రావాలని ఎవరూ కోరుకోరు సార్."

"ఏమిటా తలబిరుసు సమాధానం?. వెళ్ళి పనిచూడు."

నాగరాజుగారు 'ఎటెండెన్సు రిజిస్టరు' ముందుకు తోసేశు. సుబ్బారావు సంతకంచేసి. బయటకు నడిచాడు. 'యూస్‌లెస్ ఫెలోస్... ఎప్పుడూ ఏదో వంక. పోషించ లేనప్పుడు అంత మందిని కనడమెందుకు?...' అని నాగరాజుగారు గొణుక్కోవడం అతడి చెవినిపడక పోలేదు. మారు మాట్లాడక తన సీట్లోకిపోయి కూర్చున్నాడు. 'పేబిల్సు' తయారు చేద్దామని 'ఫారము' దగ్గర పెట్టుకున్నాడు కాని, మనసు పనిపై లగ్నం కాలేక పోతుంది. అతడి మనసులో భయంకర

నష్టమైన ఆలోచలు మెదులుతున్నాయి.

పక్కసీట్లోవున్న ప్రకాశం సుబ్బారావుని చూసి,

"ఏమిటాలో చిస్తున్నావ్ సుబ్బారావు. ఇవాళ ఆలశ్యమైందే..." అన్నాడు.

సుబ్బారావు దీర్ఘమైన నిట్టూర్పు విడిచాడు.

"నాగరాజుగారి అరుపులు మనకి కొత్తకాదు ఇంకా దాన్ని గురించే ఆలోచిస్తున్నావా ..."

"నేను ఆలోచిస్తున్నది నాగరాజుగారిని గురించి కాదు ప్రకాశం. ఆయన మాటలకు ఈ శరీరమూ, మనసూ ఏనాడో అలవాటు పడిపోయాయి..."

"మరి..."

"మా ఆఖరి వాడికి వంట్లో బావుండడంలేదు ఏదో మామూలు జ్వరమే కదానని మా ఆవిడ గృహ వైద్యం చేస్తోంది...ఇవాళ వాడి పరిస్థితి అధ్వాన్నమైంది. జ్వరం మరింత ఎక్కువైంది. వెర్రిచూపులు చూస్తున్నాడు ... తల పక్కకు తిప్పలేక పోతున్నాడు ... నాకేమిటో భయంగా వుంది ప్రకాశం..."

"డాక్టరుకు చూపించలేదా ?..."

"నడుస్తున్నదిఆఖరి వారం కదా ... చేతిలో పైసాలేదు...ఇవాళ పొద్దున్న మా వీధిలోవున్న డాక్టరుకు చూపించాను.. ప్రస్తుతానికి వాడమని ఏవో మందులు రాసిచ్చారు.. ఇదేదో విషజ్వరంలా వుందని చెప్పి పెద్ద డాక్టరు దగ్గరకు తీసుకువెళ్ళమన్నాడు...డబ్బులేక ఆయన రాసిచ్చిన మందులె కొనలేకపోయాను: అలాంటిది పెద్ద డాక్టరు దగ్గరకు ఎలా తీసుకు వెళ్ళగలను ?...ఇలాంటి ఇబ్బందులు నాబోటి దరిద్రుడి ఇళ్ళల్లోనే వస్తాయి.."

"ఎంతవుతుంది ?..."

"పెద్ద డాక్టరు 'కన్సల్టింగ్ ఫీజ్' ఇరవయ్యో, పాతికో వుంటుంది. ఆటుపైన మందులు ... కనీసం యాభై రూపాయలేనా వుండాలి..."

ప్రకాశం కొంచెంసేపు మాట్లాడలేదు.

"నాగరాజుగారు ఎంత చెడ్డవాడయినప్పటికీ ఆయనలో మానవత్వం వుండకపోదు ఇప్పుడు నీకు అంత డబ్బు ఇవ్వగలవాడు ఆయనొక్కడే.. పరిస్థితి వివరించి చెప్పి ఆయన్ని అడక్కూడదూ ?..."

సుబ్బారావు పెదవి విరిచి,

లాభం లేదుప్రకాశం... మువ్వన్నట్లుఆయన ఇవ్వగలవాడేకాని ఇవ్వడు... అడిగి లేదన్పించుకోవడం కంటె అడక్కపోవడమే మంచిదేమో ;" అన్నాడు.

"అలా కాదు సుబ్బారావు... మనకు పని ముఖ్యం... ఇస్తే ఇస్తాడు లేకపోతేఇవ్వనంటాడు అడుస్తాడు... అంతే కద... మన ప్రయత్నాల్లో లోపం వుండకూడదు."

"అంతేనంటావా ?..."

"ఆయన నిన్న నిన్నదో టి. ఏ బిల్లు వేసి పెట్టమన్నాడు కద ముందు అది పూర్తిచేసి, ఆయన కాస్త 'మూడ్సు'లోకి వచ్చాక నీ పరిస్థితి వివరించి చెప్పు... ఇంటికి వెళ్ళిపోడానికి 'పర్మిషనూ,' కావాల్సిన డబ్బూ అడుగు..."

"నీ మాట కాదనడమెందుకు ;"

సుబ్బారావు 'పేబిల్' వారంట్సు' పక్కన పెట్టి, నాగరాజుగారి టి. ఏ బిలు వెయ్యడానికి పూనుకున్నాడు. నగరాజుగారు కేంపునుండి తిరిగి వచ్చి రెండ్రోజులు కాలేదు ఆ కేంపుకి కావాల్సిన ఎడ్వాన్సు రెండొందలు ముందే తీసుకున్నారు సుబ్బారావు బిల్లు పూర్తి చేసేసరికి పన్నెండుంబావయింది. బిల్లు మొత్తం రెండొందలతొమ్మిది రూపాయల ఏభై పైసలు తీసుకున్న ఎడ్వాన్సు రెండొందలు పోతే ఆయన చేతికి వచ్చేది తొమ్మిది రూపాయల ఏభై పైసలు. ఆ కొద్ది మొత్తం కోసం వచ్చిన రోజు నుంచి కంగారు పడిపోతున్నారు నాగరాజుగారు. సుబ్బారావు బిల్లు చేత పట్టుకొని, నాగరాజుగారి గదిలోకి వెళ్ళాడు.

"సార్...మీ టి. ఎ బిలు పూర్తిచేశానండి."

నాగరాజుగారి ముఖం వికసించింది.

"గుడ్...కూర్చో..."

సుబ్బారావు ఆయనకెదురుగా వున్న కుర్చీలో పతికిలబడ్డాడు. నాగరాజుగారు అన్నారు:

'సుబ్బారావు... నువ్వింకా వయసులో చిన్నవాడివి...ఈ వయసులో కష్టపడితే దాని ఫలితం ముందుముందు వుంటుంది ... మనిషన్నాక ప్రతీవాడికి సంసారముంటూ వుంటుంది. సమస్యలంటూవుంటాయి. పెళ్ళానికో, పిల్లలకో జబ్బో, దగ్గొ వస్తాయి. వాటికి ప్రాధాన్యత నివ్వాల్సిందే. కాదనను...కాని వాటికి అధిక ప్రాధాన్యత నిచ్చి, ఆఫీసు పని నిర్లక్ష్యం చేయగూడదు... ఇవ్వాల్టి సంగతేతీసుకో, నువ్వు గంట ఆలశ్యంగావచ్చావు. గంటంటే తక్కువ కాదు. ఆ గంటలో ఆరడజను "డ్రాఫ్టులు" తయారు చెయ్యవచ్చు..."

సుబ్బారావుకు ఆయన మాటలు వింటుంటే తన పని జరుగుతుందన్న ఆశ సడలిపోతోంది. అయితే అతనికి అర్థం కానిది—ఆఫీసు టైములో ఆయన టి. ఏ. బిలు వెయ్యడం ఆఫీసు పనా ? అది ఆయన స్వంత పని కాదూ ? దీనికి ఆ బిల్లు వెయ్యడానికి ముప్పావుగంట పట్టింది. అంటే తన ముప్పావుగంట ఆఫీసుటైము వృధా చేసినట్లేగా ? నాగరాజుగారి దగ్గర ఆ మాట అనడానికి అతడికేకాదు. ఆఫీసులో మరెవరికీకూడా ధైర్యం లేదు, ఆయన ఏమన్నా తను పడాలి. తనకు పని జరగడం ముఖ్యం ;

"మీరు చెప్పింది నిజమే సార్. ఇవాళ ఆఫీసుకు 'లేటు' గా వచ్చాను అందుకు కారణం - మా ఆఖరివాడి పరిస్థితి ఏమీ బావుండలేదు. రెండ్రోజులుగా ఏదో మామూలు జ్వరమేకదా నని అశ్రద్ధచేశాను. ఇవాళ తెలుసున్న డాక్టరు దగ్గరకు తీసుకువెళితే చివాట్లు వేశాడు. రెండ్రోజులుగా అశ్రద్ధ చేసినందుకు. ఏదో విషజ్వరంలా వుందని హెచ్చరించి, వెంటనే పెద్దడాక్టరు దగ్గరకు తీసుకువెళ్ళమన్నాడు. పెద్దడాక్టరు దగ్గరకు తీసుకు వెళ్ళాలంటె అయిదూ పదిలో జరిగేది కాదు. జరిగేది ఆఖరి వారం. డబ్బుకు ప్రయత్నించాలి. అంతేకాక "క్యాజువల్ లీవు" అయిపోయింది. పరిస్థితి మీతో వివరించి చెప్పి, "పర్మిషన్" తీసుకు వెడదామని వచ్చాను..."

నగరాజుగారు మౌనంగా వినసాగారు.

"సార్ ; ఎంత ప్రయత్నించినా అప్పుఎక్కడా దొరకలేదు. ఒక్క యాభై రూపాయలు ఇవ్వగలరా ; మళ్ళీ నెల రాగానే ఇచ్చేస్తాను. ఇంటికి వెళ్ళడానికి పర్మిషన్ ఇస్తే వాడ్ని పెద్ద డాక్టరు దగ్గరకు తీసుకువెళ్ళడానికి వీలవుతుంది."

నాగరాజుగారు 'ఉలిక్కి' పడ్డారు. ఈ గుమాస్తాలకు అలుసిస్తే నెత్తికెక్కి కూర్చుంటారు. మంచిగా మాట్లాడితే అప్పు అడుగుతున్నాడు: ఆఫీసు ఎగ్గొట్టడానికి పర్మిషన్ అడుగుతున్నాడు. అంతకు ముందు ఆయన ముఖంలో వున్న ప్రసన్నత మాయమై, దాని స్థానె గంభీరత వచ్చింది. కనుబొమలు ముడివడినై: కళ్ళల్లో ఎర్రటి జీర వచ్చింది : దానికితోడు స్వరంలో క్రౌర్యం జత కూడింది.

"యాభై రూపాయలువెక్కడ్నుంచితెమ్మంటావ్, ఎంత చెట్టుకు అంత గాలి. ఇష్టం వచ్చినప్పుడు వచ్చిపోవడానికి ఇది సినిమాల్లు కాదు, ఇది ఆఫీసు. వెళ్ళి పే బిల్సు సంగతి చూడు. సాయంత్రంలో అయిదయ్యేలోపల, ఆఫీసు వదిలితే నీమీద కఠిన చర్య తీసుకోవాల్సి వుంటుంది ...వెళ్ళు."

సుబ్బారావు ముఖం పాలిపోయింది. చెమర్చిన కళ్ళు తుడుచుకుంటూ బయటకు వచ్చేశాడు.

"ఏమన్నాడు ;" అన్నాడు ప్రకాశం.

"ఏ మంటాడు. మామూలే..." అంటూ సీట్లో చతికిల బడ్డాడు సుబ్బారావు. ప్రకాశం దీర్ఘంగా ఆలోచిస్తూ వుండి పోయాడు. సుబ్బారావు 'పేబిల్సు' రాయడానికి పూనుకొన్నాడు.

అయిదయ్యాక నాగరాజుగారు ఇంటికి వెళ్ళిపోయారు ప్రకాశం తన దగ్గరున్న పది రూపాయలూ సుబ్బారావుకు ఇచ్చి,

'నువ్వు ఇంటికివెళ్ళు సుబ్బారావు నా దగ్గరున్న పదీ ఇచ్చాను. ఎలాగోలాగ మరింకో యాభై పుట్టించి నేనూ తస్తాను... అన్నాడు.

సుబ్బారావు ప్రకాశం రెండుచేతులూ పట్టుకుని కళ్ళకద్దుకు పెట్టుకున్నాడు.

"వెళ్ళు సుబ్బారావు. మరింత ఆలశ్యం చెయ్యకు"

సుబ్బారావు కళ్ళు తుడుచుకుని ఇంటికి బయల్దేరాడు.

• • •

సుబ్బారావు ఇంటికి వెళ్ళేసరికి, అతడిభార్య రుక్మిణి ఆఖరి వాడిమంచం దగ్గర దిగాలు ముఖం వేసుకుని కూర్చుని వుంది.

"రవికి ఎలావుంది రుక్మిణీ ..." అన్నాడు సుబ్బారావు.

రుక్మిణి తలెత్తి, అతడి వైపు చూస్తూ,

"ఇక్కడ పిల్లాడికి ఎలావుందోనన్న ఆదుర్దా కూడాలేదు. పొద్దున్నెగా వెళ్ళినవారు ఇప్పుడా రావడం ?..." అన్నది

'ఏం చెయ్యమంటావు రుక్మిణీ ... నేను త అసమర్థుణ్ణి...అప్పు పుడుతుందేమోనని,'పర్మిషన్ తీసుకు వద్దామని ఆఫీసుకు వెళ్ళాను..'క్యాజువల్ లీవు అయిపోయింది కద... 'పర్మిషన్' సంగతి కేవుడెరుగు, ఆఫీసుకు లేట యినందుకు ఆఫీసరు గారు తిట్టారు...అభిమానాన్ని చంపుకుని,

ఆఫీసరుగారిని కూడా అప్పు అడిగాను. ఫలితం.."

"డబ్బు దొరకలేదా?..." ఆదుర్దాతో అన్నది రుక్మిణి

"మనకు సహాయం చేసేవాడు ప్రకాశం ఒక్కడేగా.. ఉన్న పది ఇచ్చాడు ... మరింకో యాభై ఎలాగోలాగ పుట్టించి తెస్తానన్నాడు..." సుబ్బారావు కొడుకు వంటిమీద చెయ్యి వేసి చూశాడు చుర్రుమంది.

"నాన్నా రవీ..."

రవి కళ్ళు విప్పాడు కాని, తండ్రివైపు చూడలేకపోయాడు. రుక్మిణి కళ్ళు వత్తుకుంది.

"పొద్దున్న రాసిచ్చిన ప్రిస్క్రిప్షన్ అందుకో... ప్రస్తుతానికి అవైనా వాడదాం..." రుక్మిణి ప్రిస్క్రిప్షన్ తెచ్చి ఇచ్చింది. సుబ్బారావు మందుల కోసం బయల్దేరాడు.

* * *

"మీకోసం ఎంతసేపట్నుంచి ఎదురు చూస్తున్నానండీ. ఇప్పుడా రావటం. త్వరగా ముఖం కడుక్కుని రండి. ఈలోపున కాఫీ తెస్తాను." అంటూ లోపలికి వెళ్ళింది వసుంధర. ప్రకాశం చెప్పుల్విడిచి కుర్చీలో చతికిలబడ్డాడు. పొద్దున్న ఆఫీసుకు వెడుతూ 'ఇవ్వాళ ఏదైనా సినిమాకు వెళదాం వసుంధరా. సిద్ధంగా వుండు' అన్నాడతను తన మాటప్రకారం వసుంధర ముస్తాబై తనకోసం ఎదురుచూస్తోంది. తన దగ్గర వున్న పదీ సుబ్బారావు కిచ్చేశాడు. అలాంటి పరిస్థితిలో సహాయం చెయ్యకుండా ఎలా వుండగలడు? అంతేకాక మరో యాభై తెస్తానని మాటయిచ్చాడు. ఇప్పుడెలా? తనకిమాత్రం అప్పు ఎవరిస్తారు?... ఈలోపున వసుంధర కాఫీ తెచ్చింది. ఆలోచిస్తున్న భర్తను చూస్తూ - "ఏం ఆలోచిస్తూ కూర్చుండిపోయారు? సినిమా మొదలు పెట్టేస్తారు. ముందు కాఫీ తీసుకొని త్వరగా తెములండి..." అన్నది వసుంధర.

ప్రకాశం కాఫీకప్పు అందుకున్నాడు.

"ఏమిటాలోచిస్తున్నారు? పొద్దున సినిమాకు వెడదామనుకున్నారు. మర్చిపోయారా?..."

"మర్చిపోలేదు వసుంధరా... ఇవాళ మనం సినిమాకు వెళ్ళడంలేదు..."

"అదేమిటి"

ప్రకాశం సుబ్బారావు కొడుకు పరిస్థితి వివరంగా చెప్పి,

"ఉన్న పదీ సుబ్బారావు కిచ్చేశాను... అది సరిపోదు...వెంటనే పెద్దడక్టరు దగ్గరకు తీసుకువెళ్ళాలి...ఎలాగోలాగ మరింకో యాభై తెస్తానని సుబ్బారావుకు మాట యిచ్చాను.." అన్నాడు.

"మన దగ్గర ఇంకేముంది?..."

ప్రకాశం తలెత్తి భార్యవైపు చూశాడు. అతడి దృష్టి ఆమె మెడలో వున్న గొలుసుపై పడింది. అతడి కళ్ళు మెరిసినై. మెల్లిగా అన్నాడు

"ఆ పరిస్థితిలో మానవత్వం వున్నవాళ్ళు ఎంత పనైనా చేస్తారు. కుర్రవాడి ప్రాణాలు ఇటూ, అటూ అన్నట్లున్నాయి... నువ్వేమీ అనుకోనంటే ఒక మాట చెబుతాను—"

"చెప్పండి—"

"ఆ గొలుసు ఇయ్యి వసుంధరా— అది తాకట్టు పెట్టి డబ్బు తెస్తాను. మళ్ళీ ఒకటో తారీకు నీ గొలుసు నీకు తెచ్చిస్తాను— సుబ్బారావుకు సహాయం చేసేవాళ్ళు మనం తప్ప ఎవరూ లేరు."

అతడి మాటలు విని వసుంధర నిర్ఘాంతపోయింది. కోపంగా అతడి వైపు చూస్తూ-

"ఛీ— మీ కళ్ళు నా గొలుసుమీదేపడ్డాయా?" అన్నది.

ప్రకాశం నిట్టూరుస్తూ -

"నువ్వు పరిస్థితి అర్థం చేసుకుంటావనుకున్నాను వసుంధరా... అయామ్ సారీ..." అన్నాడు. వసుంధర ఏమీ వినకుండా లోపలకు వెళ్ళిపోయింది. ప్రకాశం శూన్యంలోకి చూస్తూ కూర్చున్నాడు వసుంధర లోపలకు వెళ్ళి మంచం మీద చతికిలబడింది. ఆమె మనసునంతనూ ఆలోచనలు ఆక్రమించుకున్నై. తమ వివాహం జరిగి రెండేళ్ళు కావస్తోంది. ఆయనలాంటి ఉత్తముడిని భర్తగా పొందడం తన అదృష్టమని అనుకోని రోజు లేదు. తనంటే ఆయన కెంత ప్రేమో, అనురాగమో తనకు తెలుసు. ఎన్నడూ తన మనసును కష్టపెట్టి ఎరుగడు. ఉన్నంతలో తనను

(మిగతా 45 వ పేజీలో)

# అద్దం అంతరాత్మ

— త్యాగి

నాడీ ప్రవీణులారా!
నాద స్వర విద్వాంసులారా!
మంచిగాలి పీల్చండి
మంచిపాట పాడండి

నినాదాల మాటున
దాక్కొని
ఉక్కిరి బిక్కిరవుతూ
ఊపిరి సలపకుండా
బతక్కండి

అద్దం అంతరాత్మను
అలసి పోనీకండి
చెమట పడుతుంది
మసక బారుతుంది
మనబొమ్మ
మనకే కనపడదు

అద్దంమీద
స్నో, పౌడరు కోటింగు
కాటుక, కుంకం వేలిముద్రలు
పొరపాటున
శృంగారానంతరం
అమ్మాయి
అద్దాన్ని కూడ అలంకరించి
నట్టుంది

అలసటను
అద్దానికి అంటగట్టేసింది

అద్దాన్నేడిపించకండి
ముసిముసి నవ్వులూ
మోనపు నవ్వులూ
నవ్వకండి
అద్దానికి భయమేస్తుంది
అద్దం పగిలిపోతుంది
ముక్కలు ముక్కలై పోతుంది

మనసారా
తనివితీరా
నిండుగా
అద్దంలోకి చూడండి
కడుపునిండుగా
ఆనందంగా
హాయిగా
నవ్వండి
నవ్వును తినండి
నవ్వుతూ తినండి

అద్దానికి
అలంకరణ వద్దని
అద్దం అంతరాత్మను
ఆరోగ్యంగా ఉంచమనీ
అమ్మాయితో చెప్పండి

నాడీ ప్రవీణులారా
నాదస్వర విద్వాంసులారా
మంచిగాలి పీల్చండి
మంచిపాట పాడండి.

* నాడీ ప్రవీణులు, నాదస్వర విద్వాంసులు - ఎదటివాడి కనుకూలంగా మాటాడి, పొగడి బోల్తాకొట్టించే 'చిత్తం చిత్తం' స్తోత్రపారాయణులకు సంకేతాలు.

# విదురించిన మానవత్వం

(24 వ పేజీ తరువాయి)

సుఖపెట్టడానికే ప్రయత్నిస్తారు. అలాంటిది ఇవాళ ఆయన తన గొలుసు ఇమ్మని ఎందుకడిగారు? ఆ గొలుసు తన పుట్టింటివారు పెట్టినది. తన మెడలో వున్నదల్లా మంగళసూత్రంగొలుసూ, ఈ గొలుసూ మాత్రమే. అదేవ్వరవి కళ్ళముందు మెదిలాయి. వాడెంత ముద్దొస్తాడు! ఒకటి రెండు సార్లు తను రుక్మిణితో అంది 'మీ రవిని మా కిచ్చెయ్యకూడదూ?' అని. అలాంటిది వాడి పరిస్థితి జీవన్మరణాల మధ్య వూగిసలాడుతోందా? ఇప్పుడు గొలుసు ఇస్తే వాడి ప్రాణం రక్షించిన దవుతుంది తనకెంత తృప్తి! అన్నమాట ప్రకారం ఒకటో తారీకున తన గొలుసు తనకు తెచ్చిస్తారు ఆయన. కొద్ది రోజులు ఆ గొలుసు తన మెడలో లేకపోతే తను అందవిహీనురా లవుతుందా? తన పరువు పోతుందా?

వసుంధర చివరికొక నిర్ణయానికి వచ్చి, హాల్లోకి వెళ్ళింది. మెడలో గొలుసు తీసి ప్రకాశం చేతికిచ్చి,

'వెళ్ళిరండి...' అన్నది.

ప్రకాశం తలెత్తి సందేహంతో భార్యవైపు చూశాడు. ఆమె ముఖంలో కోపం లేదు: ప్రసన్నత వుంది.

ఆమెను దగ్గరకు తీసుకుని,

"వసుంధరా! నువ్వు నా భార్య కావడం నా అదృష్టం." అన్నాడు

ప్రకాశం చెప్పులు తొడుక్కొని వెళ్ళిపోయాడు. వసుంధర అతడు వెళ్ళినవైపే చూస్తూ "భగవంతుడా...రవిని బ్రతికించు" అనుకుంది.

* * *

ప్రకాశం గొలుసు సోహన్‌లాల్ షాపులో తాకట్టు పెట్టాడు. సోహన్‌లాల్ వందరూపాయలు ప్రకాశానికిచ్చి, నెలకి వందకి ఇరవై రూపాయలు వడ్డీ అనిచెప్పి, నెలరోజుల లోపల నూట ఇరవై యిస్తే గొలుసు వాపసు యివ్వబడుతుందన్నాడు.

ప్రకాశం వెళ్ళేసరికి సుబ్బారావూ, రుక్మిణీ, రవి మంచం దగ్గర దిగాలుముఖాలు వేసుకుని కూర్చుని వున్నారు.

'ఎలా వుంది సుబ్బారావు .....' అన్నాడు ప్రకాశం.

"నువ్విచ్చిన పదిపెట్టి మందులు కొనివేశాం'

"పద సుబ్బారావు...వెంటనే పెద్ద డాక్టరు దగ్గరకు తీసుకువెడదాం."

ప్రకాశం వెళ్ళి టాక్సీ తెచ్చాడు. సుబ్బారావు రవిని ఎత్తుకొని టాక్సీ ఎక్కాడు. రుక్మిణి కళ్ళు తుడుచుకుంటూ నిలబడింది. ప్రకాశం టాక్సీ ఎక్కుతూ...

'నీ కొడుకు ఆడుతూ పాడుతూ ఇంటికి వస్తాడమ్మా రుక్మిణీ. అనవసరంగా మనసు పాడు చేసుకోకు' అన్నాడు.

రుక్మిణి చేతులు జోడించింది.

"రామచంద్రయ్యగారి హాస్పిటల్‌కి పోనీయ్."

టాక్సీ కదిలింది.

"రామచంద్రయ్యగారు 'ఫీజు ఎక్కువ తీసుకుంటారని విన్నా'నండి..."

"మరేం ఫర్వాలేదు సుబ్బారావు... ఆయన హస్తవాసి మంచిది... ఆయన తీసుకున్న కేసులు ఫెయిలవ్వవు... ఇలాంటి సమయంలో మనం డబ్బుకి చూసుకోకూడదు మనకు కుర్రవాడి ప్రాణం ముఖ్యం. డబ్బుకాదు" సుబ్బారావు మరేమీ మాట్లాడలేదు. రామచంద్రయ్య గారి హాస్పిటల్ చేరుకునే సరికి ఎనిమిది గంటలైంది.

రామచంద్రయ్యగారు రవిని పరీక్షించి, ప్రకాశం, సుబ్బారావుల వైపు చూస్తూ,

"ఇంతవరకూ ఏం చేస్తున్నారు?.." అన్నారు.

సుబ్బారావు గుడ్లనీరు కుక్కుకోవడం తప్ప, సమాధాన మియ్యలేక పోయాడు.

"చూడండి ఇది మెనన్‌జైటిస్'. పరిస్థితి ఇంతగా విషమించాక నాదగ్గరకు తీసుకు రావడం అనవసరం. ఈ కేసు తీసుకోలేను. కనీసం మధ్యాహ్నం తీసుకు వచ్చివుండి నా తీసుకొందును. కుర్రవాడి ప్రాణాలు రక్షించగలిగేవాడిని."

సుబ్బారావు వెక్కి వెక్కి ఏడ్వసాగాడు. ప్రకాశం చేతులు జోడిస్తూ -

"డాక్టరుగారూ... డబ్బు ఖర్చు ఎంతైనా ఫర్వాలేదు. కుర్రాడి ప్రాణాలు రక్షించండి. నాకు తెలుసున్నంతలో మీ కంటే అనుభవంగల డాక్టర్లు లేరు. ఈ కేసు మీరు తీసుకోకపోతే మరే డాక్టరు తీసుకోడు. ఈ "కేసు" మీరు తీసుకుంటే తప్పక సక్సెస్ అవుతుందన్న నమ్మకం నాకుంది..."

రామచంద్రయ్యగారు కొద్దిక్షణాలు మాట్లాడ లేదు, చివరకు అన్నారు.

"చూడు బాబూ... నీ పేరేమిటో తెలియదు. వయసులో చిన్నవాడివి...నాలో మానవత్వముంది బాబూ...డబ్బుకీ, ప్రాణానికీ నేనెప్పుడు లంకె వెయ్యను... నువ్వు డబ్బియ్యకపోయినా కుర్రవాడి ప్రాణాలు నేను రక్షించగలిగితే ఇంకేం కావాలి! ఈ పరిస్థితిలో పేషంటును ఎవరూ ఎడ్మిట్ చేసుకోరు. నేను తీసుకుంటే కేసు సక్సెస్ అవుతుందన్న ఆశ నీకుందన్నావు. సరే...నా ప్రయత్నంలో లోపమెందుకుండాలి?... నా హాస్పిటల్లో ఎడ్మిట్ చేసుకుంటాను. నా శాయశక్తులా ప్రయత్నిస్తాను ... ఫలితం దైవాధీనం..."

నర్సువచ్చి రవిని ఎత్తుకుని వెళ్ళింది. రామచంద్రయ్యగారు మందులు రాసి ప్రకాశానికిస్తూ

"ఎదురుగా వున్న కొట్లో తొందరగా పట్రండి" అన్నారు.

ప్రకాశం మందులకోసం వెడుతూ,

'సుబ్బారావు... నువ్వు ఇంటికి వెళ్ళి భోజనం చేసిరా ..రవి తప్పకుండా బ్రతుకుతాడని నాకు అనిపిస్తోంది... మీ ఆవిడను కంగారు పడవద్దని చెప్పు ..' అన్నాడు.

సుబ్బారావు ఏదో చెప్పబోయాడు.


"నిన్ను వెళ్ళమంటూంటే..." కాస్త స్వరం హెచ్చించి అంటూ మందులకోసం వెళ్ళాడు ప్రకాశం. సుబ్బారావు ఇంటికి వెళ్ళాడు.

సుబ్బారావు తిరిగి వచ్చాక ప్రకాశం ఇంటికి వెళ్ళి వచ్చాడు.

ఇంచుమించు ఆ రాత్రంతా రామచంద్రయ్యగారు హాస్పిటల్లోనే వున్నారు. మాటిమాటికి రవిని పరీక్షిస్తూనే వున్నారు. ఇంజక్షన్లూ, మందులూ ఇస్తూనే వున్నారు. సుబ్బారావూ, ప్రకాశమూ రాత్రంతా నిద్రపోనేలేదు. హాస్పిటల్ వరండాలో బల్ల మీద చతికిల బడ్డారు.

* * *

తెల్లవారింది. రవి పరిస్థితి మరింత విష




శంకర్ - సాగర్

# ఈలోకం

- కుమారి కాద సరోజారాణి

ఈలోకం - మన నరలోకం
మానవులేగాని - దానవహృదయుల లోకం
తన సుఖమేగాని - పరసుఖం కాంచనిలోకం
స్వార్థంతో ఎదుటికీడుని తలచి ఆనందించే పాడులోకం
వేదికపైని మనమూ మనమని లెక్చర్లిచ్చి
తెర వెనుక నీదీ నాదని వాదులాడే పైశాచికలోకం
ఇది ఎవరికోసం - యిది ఆరనిశోకం
నాడూ - నేడూ తీరనిశాపం
మరి యిది తీరేదెప్పుడు ?
మనిషిలోని మానవత్వం మేల్కొన్నప్పుడు
ఎదుటివారిని మనిషిలాగ గుర్తించినప్పుడు
సమరసభావం కలిగినప్పుడు
నీది నాదని భేదంలేక
మనమనే నిజం తెల్సుకున్నప్పుడు...
అదే నిజమైన సోదరభావం
అప్పుడే మనకు పరమానందం
అనాడె యిలలో స్వర్గలోకం

---

మించలేదు. ఆ కుర్రవాడు తప్పకుండా బ్రతుకుతాడన్న ఆశ రామచంద్రయ్యగారికి కలిగింది.

పదిగంటలైంది. ఆఫీసుకు సుబ్బారావూ, ప్రకాశమూ వెళ్ళలేదు. ప్రకాశం మాత్రం 'లీవు లెటర్' పంపాడు. నాగరాజుగారు సుబ్బారావుపై కారాలూ, మిరియాలూ నూరసాగారు. విధి నిర్వహణలో ఆఫీసులో ఎవరివల్లనైనా లోపం జరిగితే ఆయన సహించలేరు. మరి ! స్టెనో 'టైపిస్టు'ను పిలిచి, సుబ్బారావు పేర ఓ 'మెమో డిక్టేటు' చేసి వెంటనే టైపు చేసి తీసుకు రమ్మన్నారు. ఆ 'మెమో' సారాంశం- లీవు పెట్టకుండా ఆఫీసుకు హాజరు కాకపోవడం క్షమించరాని నేరం. అతడిపై కఠిన చర్య ఎందుకు తీసుకో రాదో సంజాయిషీ చెప్పుకోవాలి అని. ఆ 'మెమో' టైపుకాగానే నాగరాజుగారు సంతకం చేశారు. అది సుబ్బారావు ఇంటి 'ఎడ్రెసు'కు 'పోస్టు' చెయ్యబడింది.

మధ్యాహ్నం ఒండుగంటలైంది. నాగరాజుగారు దినపత్రిక ఏకాగ్రతతో పఠిస్తున్న సమయంలో టెలిఫోన్ మ్రోగింది. నాగరాజుగారు రిసీవరు అందుకున్నారు.

"ఎస్...నాగరాజు స్పీకింగ్..."

"............"

"ఆc సుజాతా నర్సింగు హోం నుండా ... ఎవరూ మాట్లాడుతుంట...డాక్టర్ శేఖరంగారా..."

"............"

"ఎవరికి......మా అబ్బాయి రమణకి ఏక్సిడెంటా...మై గాడ్..."

"............"

"మైనరు ఏక్సిడెంటయితే మాత్రం......ఈ 'టాక్సీ వాళ్ళు 'యూస్‌లెస్ ఫెలోస్' ... నేను వెంటనే వస్తున్నా డాక్టరుగారూ..."

నాగరాజుగారు రిసీవరు క్రెడిల్‌మీద వుంచి నిలబడ్డారు. అప్పటికే ఆయనకు వళ్ళంతా చెమట పోసేసింది. ఆదుర్దాగా రోడ్డుమీదకు వచ్చి, టాక్సీ పిలిచి ఎక్కాడు. "సుజాతా నర్సింగ్ హోంకి పోనియ్యి" అన్నారు. ఆయన మనసు నంతనూ ఆలోచనలు ఆక్రమించుకున్నాయి. చాలాకాలం వరకు భగవంతుడికి తనపై దయ కలుగలేదు. పిల్లలు లేరన్న చింత తనకూ, తన భార్యకూ నానాటికీ ఎక్కువ కాసాగింది. తమకు నలభై ఏండ్లు వచ్చాక దేవుడికి తమపై దయ కలిగింది. తమ జీవితంలో పన్నీటి వాన కురిసింది. ఓ శుభ ముహూర్తాన కొడుకు పుట్టాడు. తమ ఆరాధ్య దైవం వెంకటేశ్వరుడు కాబట్టి, కొడుక్కి 'వెంకటరమణ' అని పేరు పెట్టుకున్నారు. వాడి కిప్పుడు పన్నెండేళ్ళు. వాడిని ఎంతో అపురూపంగా చూసుకుంటున్నారు. వాడి కాలికి ముల్లు గుచ్చుకున్నా తామిద్దరూ భరించలేరు. వాడు తమ ఆశా కిరణం, తమ వంశోద్ధారకుడు !

అలాంటిది వాడికి యాక్సిడెంటా ? డాక్టరు శేఖరం మైనరు యాక్సిడెంటు అన్నారు. కాని ఏమో ఏం చెప్పగలం ? వాడికేమైనా అయితే తామిద్దరూ భరించలేరు.

టాక్సీ సుజాతా నర్సింగ్‌హోం గుమ్మం దగ్గర ఆగింది. టాక్సీవాడికి డబ్బిచ్చి, తడబడే అడుగుల్తో లోపలికి వెళ్ళాడు నాగరాజుగారు. డాక్టరు శేఖరంగారు గదిలో కుర్చీలో కూర్చొని వున్నాడు రమణ. అతని చేతులకూ, కాళ్ళకూ 'బ్యాండేజి' కట్టబడి వుంది. తండ్రిని చూస్తూనే -

"నాన్నా..." అన్నాడు.

'మెడికల్ జర్నల్' చదువుతున్న డాక్టరు శేఖరంగారు తలెత్తిచూసి,

"నమస్కారం నాగరాజుగారూ..." అన్నారు.

"నమస్కారం..."

నాగరాజుగారు రమణ దగ్గరకు వెళ్ళి, అతని వళ్ళు నిమురుతూ,

"గట్టిదెబ్బలు తగల్లేదు కద ... అసలు నువ్వు రోడ్డుమీద కెందుకు వెళ్ళావ్ ?..."

"పెన్సిలు కొనుక్కుందామని వెళ్ళాను నాన్నా."

"వెధవ పెన్సిలు ... నీకు కావల్సిన వన్నీ లిస్టురాసి ఇయ్యి ... సాయంత్రానికల్లా తెప్పించి పడేస్తాను...ఇకముందు రోడ్డుమీద తిరగకు..."

"అలాగే నాన్నా..."

"డాక్టరుగారూ.. పెద్ద దెబ్బలేం తగల్లేదు కదా.. మరేం భయం లేదుకదా..." శేఖరంగారు నవ్వి,

"పెద్ద దెబ్బలేం తగల్లేదండి. కాస్త చేతులూ, కాళ్ళూ గీసుకుపోయాయి ... డ్రెస్ చేశాను... మరేం భయంలేదు..." అన్నారు

నాగరాజుగారు కొడుకువైపు తిరిగి,

"పద నాన్నా. ఇంటికి పోదాం..." అన్నాడు.

"మధ్యాహ్నం స్కూలు వుంది నాన్నా..."

"ఈ పూట నువ్వు స్కూలుకు వెళ్ళక్కర్లేదు. పద ఇంటిదగ్గర అమ్మ కంగారు పడుతుంది"

"అయితే సరే నాన్నా:"

నాగరాజుగారు ఏదో గుర్తుకొచ్చినట్లు శేఖరంగారి వైపు తిరిగి,

"అన్నట్లు మీ ఫీజు సంగతి మర్చిపోయాను." అన్నారు.

"మరేం పర్వాలేదులెండి" శేఖరంగారు నవ్వేరు.

"నో...నో సమయానికి మందు వేశా.. మీకు ఫీజు యివ్వాల్సిందే."

నాగరాజుగారు కోటు జేబులోంచి పర్సుతీశాడు. అది నెలలు నిండిన గర్భిణీస్త్రీలా వుంది !

పర్సు తెరిచాడు. ఒక అరలో పది రూపాయల నోట్లూ, మరో అరలో అయిదురూపాయల నోట్లూ వున్నాయి. ఆ నోట్లన్నీ చేత్తోపట్టుకొని చెయ్యి ముందుకు చాపుతూ

"మీ ఫీజెంత డాక్టరుగారూ ?" అన్నారు నాగరాజుగారు.

శేఖరంగారు ఆయనవైపు వింతగాచూస్తూ నిలబడ్డారు.

"ఏమిటలా చూస్తున్నారు ? మీ ఫీజెంతో

తీసుకోండి.

శేఖరంగారు ఓ అయిదు రూపాయల నోటు తీసుకున్నారు.

"వాట్ ? మీ ఫీజు అయిదురూపాయలేనా ?"

'అవును నాగరాజుగారూ. మీరుడబ్బున్నవాళ్ళే కావచ్చు. కాని నేను శ్రమకు మించిన ఫలితాన్ని ఆశించే వాడినికాను. ఈ అయిదుకూడా మీరు బాధపడతారని తీసుకున్నాను. మీరు అసలేం ఇవ్వకపోయినా ఏమీ అనుకుని వుండేవాడిని కాదు .." నాగరాజుగారు ఒక్క క్షణం తెల్ల ముఖం వేసి, అంతలోనే వర్దుకుని,

"చాలా థాంక్స్ డాక్టరుగారు. మరివెళ్ళివస్తాం" అన్నారు.

"మంచిది."

నాగరాజుగారు కొడుకును ఎత్తుకుని వెళ్ళిపోయారు.

పరిగ్గా ఆ దేవసమయానికి డాక్టరు రామచంద్రయ్యగారు ఓడిపోయారు. గతరాత్రి ఎనిమిది గంటల నుండి సలిపిన పోరాటంలో ఆయన ఓడిపోయారు. ప్రథమంగా ఆయన తీసుకున్న 'కేసు' ఫెయిల్ అయింది రామచంద్రయ్యగారు పాలిపోయిన ముఖంతో తన గదిలోకి వెళ్ళికూర్చున్నారు. సుబ్బారావు వెక్కి-వెక్కి ఏడ్వసాగాడు. ప్రకాశానికి అతడి నెలా వోదార్చాలో అర్థం కాలేదు. అతడు కాస్సేపు తుడుచుకుని రామచంద్రయ్యగారి గదిలోకి వెళ్ళాడు.

"మీ 'ఫీజు' ఎంత డాక్టరుగారూ ?..."

రామచంద్రయ్యగారు తలెత్తి ప్రకాశం వంక చూశారు. ఆయన కళ్ళుచెమర్చి వున్నాయి.

ఫీజా ?. వద్దుబాబూ. నాలోనూ మానవత్వముంది బాబూ. నేనోడిపోయాను ఆ కుర్రవాడి ప్రాణాలు రక్షించలేకపోయాను రక్షించగలిగివుంటే ఫీజు తీసుకుందును. అయితే ఓ సంగతిబాబూ పరిస్థితి విషమించాక ఆ కుర్రవాడ్ని నా దగ్గరకు తీసుకొచ్చారు కనీసం నిన్న మధ్యాహ్నం తీసుకొచ్చి వుండినా, ఆ కుర్రాడి ప్రాణం రక్షించగలిగి వుండేవాడిని... అదే నా బాధ..."

"మీరేం చేస్తారు డాక్టరుగారూ ... మీ శాయశక్తులా ప్రయత్నించారు. ముందు తీసుకురాలేకపోయాం పరిస్థితులలా వచ్చాయి మానవత్వం కొందరిలో ఎప్పుడూ నిద్రపోతూనే వుంటుంది డాక్టరుగారూ..."

రామచంద్రయ్యగారికి అతడి మాటలుపూర్తిగా అర్థం కాలేదు

'కుర్రవాడి శవాన్ని తీసుకుపోవచ్చు కదండి'

'తీసుకుపోవచ్చు...ఒక్క అయిదు నిమిషాలు కూర్చోండి డెత్ సర్టిఫికెట్ యిస్తాను"

ప్రకాశం కూర్చున్నాడు. ఆయన సర్టిఫికెటు యిచ్చాక లేచి నిలబడి -

'వస్తాం డాక్టరుగారూ..." అంటూ బయటకు వచ్చాడు ప్రకాశం.

ప్రకాశమూ, సుబ్బారావు రవిని ప్రాణాలతో హాస్పిటల్‌కి తీసుకువెళ్ళారు; ప్రాణంలేని కట్టెను ఇంటికి తెచ్చారు. ఒక్కగానొక్క కొడుకు శవంపై పడి స్నేహ విదారకంగా ఏడ్వసాగింది. ఆమెను ఎవరూ ఓదార్చలేకపోయారు. ఆమె ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లి పడిపోయింది.

ఆ సాయంత్రం -

నాగరాజుగారు గ్లాస్కో పంచె, గ్లాస్కో లాల్చీ ధరించి, భుజంపై కండువా వేసుకొని చేతి కర్ర వూపుకుంటూ హుందాగా అడుగులువేస్తూ వాహ్యాళికి బయలుదేరారు కొంత దూరం నడిచాక ఆయన కొక జనసమూహం ఎదురైంది. ముందు ఒక వ్యక్తి కుర్రవాడి శవాన్ని ఎత్తుకుని నడుస్తున్నాడు అతడి వెనుక నలుగురైదుగురై వున్నారు. వాళ్ళ వెనుక ఇద్దరున్నారు. వాళ్ళు అల్లంత దూరాన వుండగానే గుర్తుపట్టగలిగారు నాగరాజుగారు. వాళ్ళందరూ తన ఆఫీసులో పనిచేస్తున్న వాళ్ళు. చివరన వున్న ఇద్దరూ ప్రకాశం, సుబ్బారావులు. సుబ్బారావు ఏడుస్తున్నాడు. ప్రకాశం ఓదారుస్తున్నాడు.

నాగరాజుగారు ఓ మర్రిచెట్టుమాటు ప్రక్కకు తప్పుకున్నారు. వాళ్ళు చెట్టుదాటి ముందుకు వెళ్ళారు. వాళ్ళ మాటలు మాత్రం నాగరాజుగారి చెవినపడుతూనే వున్నాయి. నా బాధల్లా ఒకటే ప్రకాశం... రవిబచ్చిపోలేదు. నేనే చేజేతులా చంపుకున్నాను...డాక్టరు గారేమన్నారు ? నిన్న మధ్యాహ్నం తీసుకొచ్చి వుండినా బ్రతికేవాడన్నారు... నిన్న మధ్యాహ్నం నాగరాజు గారికి వాడి పరిస్థితి వివరించి చెప్పాను...ఆయన మనసుకరగలేదు నిన్న మధ్యాహ్నం ఇంటికి వెళ్ళడానికి పర్మిషన్ యిచ్చి, నేనడిగిన డబ్బు ఆయన యిచ్చివుంటే నా రవి బ్రతికేవాడు ప్రకాశం..."

"నాగరాజుగారిని గురించి అనుకుని లాభమేమిటి ? కొందరు మనుష్యులంతే సుబ్బారావు. వాళ్ళలో మానవత్వమనేది ఎప్పుడూ నిద్రపోతూనే వుంటుంది."

నాగరాజుగారిలో నిదురించిన మానవత్వం హఠాత్తుగా మేలుకొంది. కండువాలో ముఖం దాచుకొని వెక్కి-వెక్కి ఏడ్వసాగారాయన.

★

# వింతలు-విశేషాలు

## జడ్జీలకు రక్షణ

అమెరికాలో నేర ప్రవృత్తి ఎంత మితిమీరి పోయిందంటే జడ్జీలు కోర్టుగదులలో కూడా తమకు రక్షణలేదని భయపడిపోతున్నారు. అందుకు "న్యూస్ వీక్" పత్రిక ప్రచురించిన ఒకవార్తయే సాక్ష్యం. పెద్ద నగరాలు చాలావాటిలో జడ్జీలు, కోర్టు రూములలో తమకు రక్షణ కల్పించమని కోరుతున్నారు. ఇది అమెరికా చరిత్రలో ఎన్నడూ జరగని విషయం. చాలామంది జడ్జీలు తుపాకులనుదగ్గరపెట్టుకుంటున్నారు. అని ఆ పత్రిక రాసింది. అంతే కాదు, కొంతమంది ఫెడరల్ జడ్జీలు తమ న్యాయాసనాలకు తుపాకిగుళ్ళు దొరబడని ఇనుప రేకు కవచాలను ఏర్పాటు చేయించుకుంటున్నారు. మిల్‌వాకీ పట్టణంలో క్రెచ్‌నెరాఫిమ్ అనే జడ్జి 24 గంటలూ ఇద్దరు అంగరక్షకులను పెట్టుకుంటున్నాడు. చికాగో క్రిమినల్‌కోర్టుజడ్జి అయిన జార్జి ఇ. డోలెజాల్, నెలకు 706 డాలర్లు జీతంమీద ఒక నేర్పరి అయిన పిస్టల్‌షూటరుని తనభార్యకు రక్షకుడుగా నియమించుకున్నాడు.

## స్నేహపూర్వక హెచ్చరిక

పశ్చిమ వర్జీనియా రాష్ట్రంలోని చార్లెస్టన్ పట్టణంలో ఆస్పత్రిబిల్లులను చెల్లించని వారికి కార్డులమీద హెచ్చరిక సందేశాలు వస్తున్నాయి. వాటిలో ఇలా వుంటోంది; "నమస్కారం నేను, ఆస్పత్రి ఎసోసియేషను కంప్యూటరుని. నీవు మా ఆస్పత్రికి బాకీపడివున్న సంగతి నాకుతప్ప మరెవరికీ తెలియదు. కాని పదిరోజులలోగా నీవు ఆ బాకీని చెల్లించకపోతే నేను మనుష్యులకు చెప్పివేస్తాను. ఆ తరువాత నీమీద చర్య తీసుకోబడుతుంది. జాగ్రత్త!"

## వధువు కావలెను

పశ్చిమజర్మనీనుంచి వెలువడే "న్యూరెంబెర్గర్ నక్రిచ్టెన్" అనే పత్రికలో ఇటీవల ఒకవివాహ ప్రకటనపడింది. అందులో ఇలా వుంది: "లక్షాధికారి, ఎందుకూ పనికిరానివాడు. ఏ పనిలోనూ ఆసక్తిలేనివాడు అయిన ఒక యువకునికి తనలాంటి మనస్తత్వమేగల యువతి కావలెను. సమాధానాలు కె. 62799 అడ్రసుకు వ్రాయవలెను."

## కాలేజీ డిగ్రీవిలువ

పెన్సిల్వేనియా (అమెరికా)లోని ఒక ప్రాథమిక పాఠశాలలో జెల్లీ పెరీన్ అనే అతను 16 సంవత్సరాలు స్కూలు తుడిచే వ్యానుగా పనిచేశాడు. కాలేజీడిగ్రీ సంపాదించాలని కలలుగంటూ వుండేవాడు. చివరికి ఎలాగైతేనేమి అది ఫలించింది. పిట్స్‌బర్గు విశ్వవిద్యాలయంనుంచి డిగ్రీ సంపాదించాడు. చీపురుకట్టను అవతల పారేసి ఉపాధ్యాయుడు అయ్యాడు. అంతా అయిన తరవాత ఇలా వాపోయాడు ; "స్కూలు తుడిచే వ్యానుగా వున్నప్పుడు కంటె టీచరుగా నాకు తక్కువజీతమే వస్తోంది" అదీ అమెరికాలో డిగ్రీలకున్న విలువ ! ★